
# గిరీశం మాస్టారు



గిరీశం మాస్టారు వున్న ప్రతి క్లాసు కూడా ఎంతో సంతోషంగా నవ్వుతూ, పేలుతూ సరదాగా సాగిపోతుంది.

తాను నవ్వకుండా ఇతరులను నవ్వించడంలో ఆయనకి ఆయనే సాటి. ఆయన క్లాసు చెప్పే నలభయి అయిదు నిముషాలూ నాలుగు సెకండ్లలాగా జరిగిపోతుంది. అలాగని- పాఠాలు జరగవని అనుకోవలసిన పనిలేదు. దేని దారి దానిదే! పాఠం పాఠంలాగా కాకుండా ఇష్టాగోష్టిలాగా కానిస్తూ, మధ్య మధ్య పిట్టకథలు, పొట్టికథలు చెపుతూ పాఠ్యాంశం చక్కగా అర్థం అయ్యేటట్లు, సారాంశం ఒంటపట్టేట్లు చెప్పడం ఆయన ప్రత్యేకత.

దసరా సెలవులు అయిన తర్వాత ఆరోజు తిరిగి కాలేజి తెరిచారు.

గిరీశం మాస్టారు క్లాసుకు వచ్చాడు. ఆయన రాగానే ఒక వెలుగు వచ్చినట్లయింది. లేచి నుంచున్న విద్యార్థుల వంక ఒకసారి తేరపార చూశాడు. చిరునవ్వు నవ్వుకుంటూ "సిట్‌డౌన్!" అన్నారు.

పిల్లలంతా కూర్చున్నారు.

"ఏమిట్రా... కొత్త పెళ్ళికొడుకుల్లాగ ముస్తాబయి వచ్చారు. దసరా సరదాగానా ఏమిటి?" అన్నారు.

పిల్లలు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

"సార్... మేమే కాదండీ... అమ్మాయిలు కూడా ముస్తాబయి వచ్చారు!" అని సన్నగా నొక్కులు నొక్కింది ఓ కంఠం.

"ఈరోజుల్లో మగవాళ్ళకీ, ఆడవాళ్లకీ తేడా తెలియడం లేదు. అందుకే అందరినీ పెళ్ళికొడుకులుగా జమ వేశాను. అది సరేకాని, ఈ గంటా పంట్లాము లేమిట్రా, కుక్క చెవులు వాలినట్లు, తడిసిన అప్పడాలు వంగినట్లు!" అన్నాడు గిరీశం మాస్టారు.

క్లాసు రూం నవ్వులతో ప్రతిధ్వనించింది.

"వెంకట్రావ్- ఆ జుట్టేమిటీ.., ఆ షర్టేమిటి? జూలో ఉన్న జంతువులనన్నిటినీ నీ షర్టుమీదే దించినావు. నువ్వు మాత్రం ఆ జూ వైపు నుంచి రాకు. ఏదో మృగం తప్పిపోయింది అనుకొని నిన్ను పట్టుకొని బోనులో పెట్టేరు..!" అన్నారు మాస్టారు తిరిగి.

మళ్లీ నవ్వులతో క్లాసు రూం దద్దరిల్లిపోయింది .

"నాయనా- షేక్ ఇమాం... పాహిమాం పాహిమాం ఇదెక్కడి షర్టయ్యా? న్యూస్ పేపరంతా నీ షర్టు మీదే వుంది. అదేదో ఊళ్లో గోడ వార్తాపత్రికలు మొదలుపెట్టారట. నువ్వు చొక్కా న్యూస్ పేపరు ప్రారంభించావేమిటి..? అయినా- అదేం ప్యాంటయ్యా బాబూ... చిరిగి పోయిన నూను గుడ్డలన్నీ అతుకు వేసినట్లు! రామ రామ- ఏమి ఫ్యాషన్లయ్యా ఇవి?" అన్నారు గిరీశం మాస్టారు.

"అవన్నీ దసరా పండక్కి కొత్తగా కుట్టించుకున్న బట్టలుసార్..." అని వెనుక బెంచి వరుస నుంచి ఓ విద్యార్థి అరిచాడు.

"ఊ... బాగున్నాయి మీ ఫ్యాషనులు!" అన్నారు మాస్టారు.

ఈసారి ఆయన దృష్టి విద్యార్థినుల వైపు మళ్లింది.

ఆడపిల్లల గుండెలు ఝల్లుమన్నాయి.

అయితే గిరిజ మాత్రం తొణకలేదు, బెణక లేదు.

ఆమె స్వతహాగా చాలా పెంకిపిల్ల. ఎవరినీ లెక్కచెయ్యదు. ధైర్యంలో మగవాళ్ళని మించినటువంటిది. గిరీశం మాస్టారు హాస్యానికి ఝుడిసి ఆయనంటే గౌరవం చూపించేది కాని, మిగిలిన లెక్చరర్లను తీసి కట్టేసేది.

గిరీశం మాస్టారు అందుకున్నారు. "ఇన్నాళ్లూ ఫోటో సింథసిస్ ప్రక్రియ కేవలం వృక్షాల్లో మాత్రమే జరుగుతుందని అనుకునేవాడిని. కాని, ఈ రోజు గిరిజని చూశాక అది మనుషుల్లో కూడా ఉండగలదని తెలుస్తోంది!" అన్నాడు.

పిడుగులు పడుతున్నట్లుగా నవ్వసాగారు మగపిల్లలు.

గిరిజ ముఖం ఎర్రబడింది కోపంతో.

"మీ ఉద్దేశం ఏమిటి సార్?" అని గట్టిగా అడిగింది.

"లేకపోతే ఏమిటమ్మా... ఆ ఆకుపచ్చ చీరేమిటి? ఆపైన అదేరంగు బ్లౌజేమిటి? అది చాలక ముఖాన్న, పాపటిలోనూ ఆకుపచ్చని కుంకుమ ఏమిటి? కనుకొలకులకు ఆ ఆకుపచ్చని చారలేమిటి?" అన్నారు మాస్టారు.

"అవన్నీ లేటెస్టు ఫ్యాషన్సు సార్! మ్యాచింగు కోసం అన్నీ ఒకే రంగులో ఉండాలి" అంది గిరిజ.

"ఓయి నీ మ్యాచింగు బంగారంగాను! మ్యాచింగు కోసం అన్నీ ఆకుపచ్చగా ఉండాలంటే కష్టం. జీవితంలో మ్యాచింగు కోసం, దసారా పండుగలలో ఒంటికి ఆకుపచ్చ రంగులు పులుముకొని హనుమంతుడి వేషం వేసుకుని రోడ్లమీద గంతులు వేస్తుంటారే- అటువంటి వాడిని ఎన్నుకోవలసి వస్తుంది!" అన్నారు మాస్టారు.

ఈసారి ఆడా మగా అందరూ పగలబడి నవ్వారు.., ఒక్క గిరిజ తప్ప!

ఆరోజు గిరిజ ఇంటికి వెళ్లిందే కాని, ఆమె మనసు మనుస్సులో లేదు.

ఆరోజు క్లాసులో జరిగిన సంఘటనే పదేపదే జ్ఞాపకం రాసాగింది. గిరీశం మాస్టారి వ్యంగ్య ధోరణి, పిల్లల నవ్వులు ఆమె చెవులలో గింగురు మనసాగాయి. ఆమె అభిమానం బాగా దెబ్బతింది.

మరునాడు గిరిజ మామూలుగా కాలేజీకి వెళ్లింది.

అయితే గిరీశం మేస్టారి హాస్యానికి ఝుడిసి మ్యాచింగువంటి ఫ్యాషన్ల జోలికి పోలేదు. ఆయనంటే ఒళ్ళు మండిపోతోంది. తనని నలుగురిలోనూ అవమానపరిచిన ఆయనంటే ఆమెకి గౌరవం పోయింది. ఆరోజు నుంచి ఆయన క్లాసులోచి వచ్చినపుడు అందరి పిల్లలతో పాటు లేచినుంచోడం మానేసింది. ఆయన క్లాసు ఒక్కదాంట్లోనే అలాచేస్తే బాగుండదని, అందరి లెక్చరర్ల క్లాసులలోనూ నుంచోడం మానేసింది.

వారం రోజులు గడిచాయి.

గిరిజలో వచ్చిన మార్పును లెక్చరర్లందరూ గమనించారు.

ఆరోజు లీజర్ సమయంలో లెక్చరర్లందూ తమ కామన్ రూంలో చేరారు. సంభాషణ అలా అలా గిరిజ గురించి వచ్చింది.

"గిరిజ మహా పెంకిపిల్ల. యెవరినీ లెక్కచేయదు. ఆమెని లొంగదీయడం ఎవరి తరమూ కాదు" అన్నాడు సుబ్బారావు. అతను ఇంగ్లీషు లెక్చరరు.

"పెంకితనం ఉంటే ఉండవచ్చు కానీ, మంచీ- మర్యాదా వుండొద్దా? లెక్చరర్లంటే బొత్తిగా గౌరవమే లేదాయె! ఆఖరికి... వాళ్లొస్తే నుంచోను గూడా నుంచోదాయె!" అన్నాడు పురుషోత్తం. అతనసలే తెలుగు లెక్చరర్.

"గౌరవమనేది ఒకళ్ళు ఇస్తే వచ్చేది కానీ, మనం కావాలంటే వచ్చేది కాదుగదా! లేచి నుంచోమని, నమస్కారం పెట్టమని మనం అడగలేం కదా. అందుకే అలా పెంకిగా ప్రవర్తిస్తోంది!" అన్నాడు సుబ్బారావు.

"ఆ అమ్మాయిని సరిచేయాలంటే ఒక్క గిరీశంగారికే సాధ్యం!" అన్నాడు పురుషోత్తం.

"ఆయన కూడా ఆ అమ్మాయిని లేచి నిలబడేట్టు చేయగలరు అనుకోను" అన్నాడు సుబ్బారావు.

"ఏమిటంటారు మాస్టారూ?" అన్నాడు పురుషోత్తం గిరీశంతో.

అంతవరకూ గిరీశం వాళ్ళ సంభాషణని వింటున్నాడే కాని, తాను జోక్యం కల్పించుకోలేదు. సుబ్బారావు ప్రశ్నతో చిరునవ్వు నవ్వి-

"మనకోసం నుంచుంటుందటండీ..? తనకోసమే నుంచుంటుంది!" అన్నారు.

తిరిగి గంట మ్రోగడంతో అంతా తమ తమ క్లాసులకు వెళ్లారు.

గిరీశం మాస్టారు క్లాసులోకి వెళ్లగానే పిల్లలంతా లేచి నుంచున్నారు. గిరిజమాత్రం నుంచోలేదు. ముఖం ముడుచుకొని సీరియస్‌గా ఎటో చూస్తూండిపోయింది.

గిరీశం మాస్టారు తనలోతానే నవ్వుకున్నారు. పిల్లల్ని కూచోమనకుండానే చిన్న ప్రసంగం ప్రారంభించారు.

"గురువులు వచ్చినపుడు విద్యార్థులు లేచి నుంచోడం అనాదిగా వస్తున్నటువంటి ఒక సత్సాంప్రదాయం. లేచి నుంచున్నంత మాత్రాన విద్యార్థులు బానిసలని అర్థంకాదు. అది గురువుల పట్ల, విద్యపట్ల వారికి గల గౌరవాన్ని సూచిస్తుంది. అందువలన గురువులు రాగానే లేచి నుంచోడానికి విద్యార్థులెవరూ కించపడనక్కరలేదు-"

విద్యార్థులు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ గిరిజ వంక చూడసాగారు.

గిరీశం మాస్టారు ఉపన్యాసం కొనసాగించారు-


"అయితే ఎట్టి పరిస్థితులలోనూ, విద్యార్థులలో కొందరు లేవలేనంతటి వ్యాధితో ఉండవచ్చు. అట్టివారు లేవనక్కరలేదు. అందువలన ఇక్కడున్న వారిలో ఎవరికయినా తీవ్రమయిన వ్యాధి ఉన్నట్లనిపించినా, లేదా ఎవరికైనా గర్భం ధరించినట్లు ఏమాత్రం అనుమానమున్నా అలాంటివారు నుంచోనక్కర లేదు. మిగిలినవారు మాత్రం నుంచోడం మంచిది."

హాలంతా చప్పట్లతో, నవ్వులతో బల్లల మీద దరువులతో మారుమ్రోగిపోయింది.

ఆ సందడిలో గిరిజ చటుక్కున లేచి నుంచుంది.

పాపం... ఆనాటినుంచి ఆమె క్లాసులో లెక్చరర్ రాగానే అందరితోపాటు తను కూడా లేచి నిల్చునేది.

*– విశ్వ రచన పక్ష పత్రిక... 1 ఏప్రిల్ ' 77*



## పన్నీటి జల్లు

ఒక సభలో ఒక ఉపన్యాసకుడు నిలబడి ఆవేశంగా ఉపన్యాసం దంచేస్తున్నాడు. ఆయనకి దగ్గరగా ముందు వరుసలో కూర్చుని ఉన్న ఒకాయన తన చేతి రుమాలుతో పదేపదే తల, ముఖం తుడుచుకోసాగాడు. అది గమనించిన వెనుక వరుసలోని ఒకాయన ప్రక్కనున్న స్నేహితుని అడిగాడు-

"ఇదేమీ వేసవి కాలం కాదే- చెమటలు పోయడానికి! మరి, ఆయనెందుకు మాటిమాటికీ తల తుడుచుకుంటున్నాడు?" అని.

"ఆ.. ఏంలేదు. ఉపన్యాసకుల వారు ఉత్తేజంతో ప్రసంగిస్తుంటే ఆయన నెత్తిన 'పన్నీటి జల్లు' కురుస్తోంది. ఆ జడివానకి తట్టుకోలేక తుడుచుకుంటున్నాడు" అన్నాడు మిత్రుడు.